తెలంగాణ ప్రభుత్వం

# పౌరసరఫరాల శాఖ కార్యాలయం

సోమాజిగూడ, హైదరాబాద్ 500082

పత్రిక ప్రకటన : తేదీ : 27-12-2018

## తెలంగాణ పౌరసరఫరాల విధానాలపై పలు రాష్ట్రాల అధ్యయనం
## జీపీఎస్ విధానం భేష్
## కేరళ పౌరసరఫరాల అధికారుల బృందం

తెలంగాణ ప్రభుత్వం సాంకేతిక పరిజ్ఞానంతో పౌరసరఫరాల శాఖలో చేపట్టిన వినూత్న చర్యలు, సంస్కరణలు, విధానాలను తమ రాష్ట్రాలలోను అమలు చేయడానికి ఆయా రాష్ట్రాల అధికారులు రాష్ట్రంలో పర్యటించి అధ్యయనం చేస్తున్నారు.

తెలంగాణ పౌరసరఫరాల శాఖ ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తోంది. ఇటీవల కాలంలో కేంద్ర ప్రభుత్వ ఆహార కార్యదర్శులు శ్రీ రవికాంత్, శ్రీ ప్రమోద్ తివారి, తమిళనాడు, ఛత్తీస్‌ఘడ్, ఉత్తరప్రదేశ్, పంజాబ్, ఇంటర్నేషనల్ లేబర్ ఆర్గనైజేషన్ (ఐఎల్ఓ) నుంచి అధికారుల బృందాలు తెలంగాణ రాష్ట్రంలో పర్యటించి అధ్యయనం చేశాయి.

తాజాగా గురువారం నాడు కేరళ పౌరసరఫరాల అధికారులు శ్రీమతి విమ్మి డేవిస్ అక్కార, శ్రీ సతీష్‌బాబు, శ్రీ ఎల్. దీపక్, శ్రీ పి.ఎచ్. హవినాష్ బృందం పౌరసరఫరాల భవన్‌లో కమాండ్ కంట్రోల్ సెంటర్, రేషన్ వాహనాలకు జీపీఎస్ విధానం, రేషన్ పోర్టబిలిటీ, టీ-రేషన్ యాప్, ఈ-పాస్ మిషన్ల పనితీరును పరిశీలించారు. ఈ సందర్భంగా పౌరసరఫరాల శాఖ కమిషనర్ శ్రీ అకున్ సబర్వాల్‌తో సమావేశమయ్యారు.

తెలంగాణ రాష్ట్రంలో జీపీఎస్ విధానంతో అక్రమాలకు అడ్డుకట్ట పడడంతో కేరళ రాష్ట్రంలోను ఈ విధానాన్ని అమలు చేయబోతున్నామని అన్నారు. కేరళలో 14,300 రేషన్ షాపులు, 86 లక్షల రేషన్ కార్డులు ఉన్నాయి. రేషన్ సరుకులు తరలించే వాహనాలకు జీపీఎస్ యంత్రాలను అమర్చడానికి ఇక్కడ అధ్యయనం చేస్తున్నామన్నారు.

రేషన్ సరకులును తరలించే వాహనాలు పక్కదారి పట్టకుండా వాటికి జీపీఎస్ యంత్రాలను అమర్చి వాటి ప్రతి కదలికలను ప్రత్యక్షంగా తెలుసుకునేలా కమాండ్ కంట్రోల్ సెంటర్ ఏర్పాటు అద్భుతంగా ఉందని ప్రశంసించారు.

ఈ సందర్భంగా కమిషనర్ అకున్ సబర్వాల్ మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం కుటుంబంలో అర్హులైన ప్రతి ఒక్కరికి ఆరు కిలోల చొప్పున కిలో రూ.1కి సరఫరాల చేస్తోందని, దీని ద్వారా రాష్ట్రవ్యాప్తంగా 2.75 కోట్ల మంది లబ్ధిపొందుతున్నారని, ప్రతి నెల 1.50 లక్షల టన్నుల బియ్యాన్ని పౌరసరఫరాల శాఖ సరఫరా చేస్తుందని అన్నారు. గత ఏడాది ప్రవేశపెట్టిన రేషన్ పోర్టబిలిటీ విధానం రేషన్ లబ్ధిదారులకు ఎంతో ప్రయోజనకరంగా ఉంది. ముఖ్యంగా హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాలో ఈ విధానాన్ని ఉపయోగించే లబ్ధిదారుల సంఖ్య అధికంగా ఉంది.

<u>**నోట్ :**</u> పౌరసరఫరాల భవన్‌లో పౌరసరఫరాల శాఖ కమిషనర్ శ్రీ అకున్ సబర్వాల్‌తో సమావేశమైన కేరళ అధికారుల బృందం

---

పౌరసరఫరాల శాఖ కార్యాలయం నుంచి జారీచేయబడినది.